క్లుప్తంగా

నేడు అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ

మాగనూర్: మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మాగనూర్ మండల కేంద్రానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రజాపాలన విజయోత్సవాలు

కోస్గి రూరల్: ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సర విజయోత్సవాలలో భాగంగా సంబరాలను మంగళవారం చేపట్టనున్నామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు, మున్సిపల్ సిబ్బందికి, కార్మికులకు వైద్య శిబిరాలు, సన్మానాలు, బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు, స్ట్రీట్ వెండర్స్‌కు లోన్‌లకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేయనున్నామన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ జట్టుకు మద్దూరు విద్యార్థులు



మద్దూరు: తెలంగాణ 68వ స్కూల్ గేమ్స్‌లో రగ్బీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఈ జట్టుకు మద్దూరు బాలుర పాఠశాలకు చెందిన శివ, చింటూ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప సోమవారం తెలిపారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం సవిత, ఉపాధ్యాయులు అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



కొత్తపల్లి: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో ప్రతిభ చూపాలని ఎంఈఓ ఆంజనేయులు అన్నారు. ప్రజాపాలనలో భాగంగా సోమవారం నిడ్జింత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల మనో వికాసానికి క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకొని సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లాజర్, శ్రీనివాస్, విజయ్‌రెడ్డి, పీడీ కతలప్ప, సుజాత పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాప్రదర్శన



కోస్గి రూరల్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు కళాప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్నామని సాంస్కృతిక సారథి కళాకారులు రవిశంకర్, కిరణ్‌లు తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి, తోగాపూర్, సర్జఖాన్‌పేట్ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరుణరాజు, స్పెషల్ ఆఫీసర్ కార్తీక్, బాలయ్య, నరసింహ, లక్ష్మి, అరుణ, సుగుణ, జహీర్, తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

ఆత్మకూర్: హరిహరపుత్ర అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణం తుదిదశకు చేరుకుంది. 14న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి భారీ ఏర్పాట్లను చేపడుతున్నట్లు డాక్టర్ శ్రీధర్‌గౌడ్, గాడి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం స్థానిక అయ్యప్ప మాలధారులతో సమావేశమై ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 12, 13, 14వ తేదీల్లో పూజ కార్యక్రమాలను ప్రముఖ వేదపండితులు గోపాలకృష్ణ, పవన్‌కుమార్‌శర్మ, జ్యోషిగోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కృష్ణా: మండలంలోని హిందుపూర్ ప్రాథమికోన్నత, ఉర్దూ పాఠశాలలను సోమవారం ఎంఈఓ నిజాముద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఇవ్వాలని, వంటలు వండే పరిసరాలతో పాటూ బియ్యం, కూరగాయలు, నాణ్యమైనవిగా ఉండాలని సూచించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఇందులో ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



హిందుపూర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హాస్టళ్లను తనిఖీ చేసిన ఎంపీడీఓ..

మక్తల్: మక్తల్ పట్టణంలో మైనార్టీ గురుకుల కాలేజీ, హాస్టళ్లను ఎంపీడీఓ రమేష్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో సాంబర్, అన్నం, బియ్యం, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు.

మరికల్: మండలంలోని జిన్నారంలో 15 రోజుల తర్వాత ప్రారంభమైన మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ జమీల్ తనిఖీ చేశారు. వంటగది, సరుకులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్, ఎంఈఓ అనిల్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాఘవేంద్రచారి, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మక్తల్ హాస్టల్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రమేష్‌కుమార్



జిన్నారంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ జమీల్



ఉర్దూ మీడియం పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ నిజాముద్దీన్

భూ గ్రహాన్ని కాపాడుకుంటాం

కోస్గి రూరల్: పర్యావరణహితంగా మెలిగి కాలుష్యం తగ్గించి భూగ్రహాన్ని కాపాడుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో వివిధ రకాల 'కాలుష్యాలు–నియంత్రణ' అనే అంశంపై సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం వల్ల భూగ్రహం వేడెక్కి వాతావరణంలో మార్పు చోటుచేసుకుంటున్నాయన్నారు. గాలి, నీరు, నేల, ఆహారం, శబ్ద కాలుష్యం జీవుల మనుగడకు తీవ్ర హాని కల్గిస్తున్నాయన్నారు. సహజ వనరులను పొదుపుగా వాడుకోవాలని, శిలజ ఇంధనాల దహనం తగ్గించడం, ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తే కాలుష్యం తగ్గించవచ్చన్నారు. కాలుష్య నియంత్రణ చట్టాన్ని ఏర్పాటు చేసినా ఫలితం లేదన్నారు. అందరు బాధ్యతగా పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు సిద్దిరాములు, త్రిగుణకరశాస్త్రి, సంతోష్, భీమయ్య ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వార్ల మల్లేశం

వార్డు సమస్యలపై ట్రెయినీ కలెక్టర్‌కు అవగాహన



మక్తల్: మక్తల్ మున్సిపాలిటీల్లో వార్డు ప్రజల సమస్యలపై అవగాహన కోసం క్షేత్ర స్థాయిలో పర్యటించినట్లు నారాయణపేట ట్రెయినీ కలెక్టర్ గరిమనూరుల్లా అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె సందర్శించారు. కమిషనర్ బోగేశ్వర్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వివిధశాఖల వారీగా ట్రెయినీ కలెక్టర్ తెలుసుకుంటుందని, మున్సిపల్ శాఖపై అవగాహన కోసం 21 రోజులు పర్యటించి ప్రజలు సమస్యలు తెలుసుకుంటుందన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్‌చార్జి ఎస్‌ఐ సునిత

నారాయణపేట ఎడ్యుకేషన్: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని షీ టీం ఇన్‌చార్జి ఎస్‌ఐ సునిత హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలైన ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, పోక్సో చట్టం, మహిళలు, అమ్మాయిలపై వేధింపులకు పాల్పడితే తీసుకోవాల్సిన చర్యలు, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య, భరోసా సెంటర్ టీం ప్రమీల, దేవి, లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌తో ప్రమాదం



మరికల్: మండల కేంద్రానికి సంబంధించిన డంపింగ్ యార్డుతో ఇబ్రహీంపట్నం గ్రామస్తులకు ప్రమాదం పొంచిఉంది. మరికల్‌కు సంబంధించిన డంపింగ్ యార్డు పక్కనే ఇబ్రహీంపట్నం ఉండటం వల్ల ఆ గ్రామస్తులు దీని ద్వారా వచ్చే దుర్వాసనతో అనారోగ్యం బారిన పడుతున్నారు. డంపింగ్‌యార్డు కిందనే పెద్దచెరువు ఉండటం వల్ల చెరువులోకి వ్యర్థ పదార్థాలు చేరి నీళ్లు కలుషిత మవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డును మార్చాలని ఎన్నోమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి డంపింగ్ యార్డును మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కోటకొండను మండలంగా ప్రకటించాలి

నారాయణపేట: అన్ని అర్హతలు కలిగిన కోటకొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బాల్‌రామ్, అంజిలయ్యగౌడ్, జిల్లా నాయకులు బాలప్ప, కాశప్పలు నారాయణపేట కలెక్టరేట్‌లో ఏఓ జయసుధకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని 155 రోజులు రిలేదీక్షలు చేశారని, బహిరంగ సభలు, ధర్నాలు చేసినా పాలకులు నిర్లక్ష్యం, నిరంకుశం, నియంతృత్వం వల్ల సమస్యను పరిష్కరించలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల ఆకాంక్ష మేరకు కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోవిందు, సీత, సుదర్శన్, వెంకటేష్ ఉన్నారు.

ఆలయానికి రూ.8.26లక్షల ఆదాయం

దేవరకద్ర: ప్రసిద్ధ చిన్నరాజమూర్ ఆంజనేయ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు ఈ నెల మూడో వారంలో జరగనుంది. సోమవారం దేవాలయం వద్ద వివిధ వేలాలు నిర్వహించగా ఆలయానికి రూ.8.26లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు. తలనీలాలు వేలం రూ.4.71లక్షలకు శ్రీనివాసులు అనే వ్యక్తి ఏడాది వరకు వేలం దక్కించుకున్నాడు. టెంకాయల వేలం జాతర నెల వరకు రూ.2,70 లక్షలకు కుర్మయ్య అనే వ్యక్తి కాంట్రాక్ట్ లభించింది. ఏడాది పాటు కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకోడానికి వెంకటేశ్ అనే వ్యక్తి రూ.85,500కు పొందాడు. వేలంలో దేవస్థాన కమిటీ చైర్మన్ రాఘవేంద్రాచారి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధారి, ఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



ఊట్కూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ హెచ్‌ఐవీ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఓఎంఐఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ హాజమ్మ మాట్లాడుతూ అందరు కలిసికట్టుగా ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, కలుషిత రక్త మార్పిడి, సిరంజీల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఎయిడ్స్ సోకిన వారి పట్ల వివక్షత చూపరాదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుసుమ, ఆరోగ్య కార్యకర్తలు రజని, ఉమ, జ్యోతి, ప్రవీణ, గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దూరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మద్దూరు పీహెచ్‌సీ సెంటర్‌లో జోగిని, ఒంటరి, దళిత, మహిళలకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబీ, ఎస్‌టీఐ వంటి వ్యాధులపై ఓఎంఐఎఫ్(ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్) ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కలుషితమైన సూది వాడరాదని, హెచ్‌ఐవీ సోకిన వ్యక్తి నుంచి రక్తం తీసుకోరాదని, లైంగిక సంబంధం పెట్టుకోరాదని, ఒక వేళ తల్లికి హెచ్‌ఐవీ సోకితే కాన్పు తప్పని సరిగా ఆస్పత్రిలోనే చేయించాలని వైద్యాధికారి నరేష్ సూచించారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ కృష్ణ, ఏఎన్‌ఎం రాజేశ్వరి, సిబ్బంది నాగమణి, పద్మ, శారద, స్వాతి, లాలమ్మ, మాధురి, తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నరేష్

గోపుర కలశాల వితరణ

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయ గోపురాలకు మల్దకల్‌కు చెందిన దాతలు రూ.లక్ష విలువ చేసే 10 కలశాలను వితరణ చేశారు. మల్దకల్‌కు చెందిన సింగనేడి ఈరమ్మ బూదయ్యల జ్ఞాపకార్థం వారి కుమారులు జ్యోతి నర్సింహయ్య, పావని నర్సింహ్మయ్యలు సోమవారం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులకు కళశాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రమేషాచారి, నరేందర్‌శెట్టి, కృష్ణ, నరేందర్ గౌడ్, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

మద్దూరు: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ వైఫల్యాలపై చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలను అమలు చేయలేదని, అందులో రైతు భరోసా కింద రూ.7,500, రూ.4 వేల పింఛన్ల పెంపు, నిరుద్యోగ భృతి, కళ్యాణలక్ష్మి, తులం బంగారం, మహిళలకు రూ. 2,500 ఉన్నాయన్నారు. ఈ వైఫల్యాలను బీజేపీ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రమేష్, మదన్, కే. రాము, శంకర్, శ్రీకాంత్, రాములు, వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి, సాయిలు, రాఘవేందర్, భరత్‌కుమార్, కన్నప్ప పాల్గొన్నారు.



చార్జిషీట్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

బీఆర్‌ఎస్ నాయకులకు మతిభ్రమించింది



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు

మరికల్: ఇంటిగ్రేటెడ్ పాఠశాల విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షులు వీరన్నలు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 25 ఎకరాల స్థలం అవసరమని గుర్తించిన అధికారులు, మొదట నారాయణపేట మండలం లింగంపల్లి, ఎక్లాపూర్‌లో, తర్వాత మరికల్ మండలం చిత్తనూర్ దగ్గర ప్రభుత్వ భూములను పరిశీలించినట్లు తెలిపారు. లింగంపల్లి దగర జిల్లాకు అనువుగా ఉంటుందనే ఉద్దేశంతోనే ఆ స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు అధికారులు ఎంపిక చేసినట్లు తెలిపారు. విషయం తెలుసుకోకుండా బీఆర్‌ఎస్ నాయకులు మరికల్‌లోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించాలని చెప్పడం సరికాదన్నారు. మరికల్ శివారులో కేజీబీవీ పాఠశాల నిర్మాణానికి ఐదు ఎకరాలు భూమి ఇవ్వని బీఆర్‌ఎస్ నాయకులు ఇంటిగ్రేటెడ్ పాఠశాల గూర్చి మాట్లాడే హక్కు లేదన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మరికల్‌కు జూనియర్ కళాశాలను తీసుకొస్తున్నారని గుర్తు చేశారు. సమావేశంలో సూర్యమోహన్, హరీష్, రామకృష్ణారెడ్డి, సత్యన్న, రామన్‌గౌడ్, రఘు, ఖాజా, చెన్నయ్య, గురుగౌడ్, నర్సిములు, రఘులు పాల్గొన్నారు.

మండల కార్యాలయాలు నిర్మించాలి

కొత్తపల్లి: ఉమ్మడి మద్దూరు మండలం నుంచి నూతన మండలంగా ఏర్పడిన కొత్తపల్లికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలను భూనీడు గ్రామంలో ఏర్పాటు చేయాలని సోమవారం గ్రామస్తులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. అన్ని సౌకర్యాలు, అర్హతలున్న భూనీడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయలేదని, గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ కార్యాలయాలు భూనీడులో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు భూనీడులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, కే.వెంకట్, తిరుమలేశ్, గోదుమ రాము, తదితరులు పాల్గొన్నారు.



మండల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని నిరసన దీక్ష

ఆశా వర్కర్లకు సర్వే డబ్బులు ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

మక్తల్: రెండేళ్ల నుంచి సర్వే చేసిన డబ్బులను ఆశా వర్కర్లకు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవిందురాజ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కర్ని పీహెచ్‌సీలో ఫార్మసిస్టు శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. 2024లో పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో చేసిన సర్వే డబ్బులు వేస్తేనే డిశంబర్ 2 నుంచి లెప్రసీ సర్వే ప్రారంభించాలని కోరారు. సర్వేల పేరుతో ఆశా వర్కర్లకు వెట్టిచాకిరి చేయించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు యశోద, అమీనాబేగం, సావిత్రమ్మ, శశిరేఖ, సుజాత, రాధిక, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

మాగనూర్: ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు బాబు అన్నారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మాగనూర్ మండల దివ్యాంగుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఎన్నికల సమయంలో రూ.6 వేలు పింఛన్ అందజేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రవి, గోపాల్, లింగమ్మ, వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి



ధర్నాలో మాట్లాడుతున్న వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్

నారాయణపేట టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా 25వేల మంది వీఆర్‌ఏలను జీఓ నెంబర్ 81, 85 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పే స్కేల్ అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం, 61 ఏళ్లు పైబడిన వారి వారసులకు ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వలేదని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ పార్క్ దగ్గర జరిగిన ధర్నాలో ఆయన మట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 3797 మంది మాత్రమే మిగిలి ఉన్నారని, వారి వారసులకు అర్హత ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జాప్యం చేయడంతో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ మాట్లాడుతూ కేసీఆర్ నియంతృత్వ, నిరంకుశ పాలనలో వారికి అన్యాయం జరిగిందన్నారు. ప్రజా పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలప్ప, గోపాల్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిలయ్య గౌడ్‌లు మద్దతు తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో జయసుధకు అందజేశారు. కార్యక్రమంలో భానుప్రకాష్, బోయ నర్సింహులు, అచలానందం నవీన్ కుమార్, కె నర్సింహులు, కె నరేష్, రాఘవేందర్, నర్సమ్మ పాల్గొన్నారు.

పునరావాస బాధితులకు న్యాయం చేయాలి

మక్తల్: సంగంబండ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గ్రామాలు, జూరాల బ్యాక్‌వాటర్ కింద ముంపునకు గురైన గ్రామాలకు చెందిన బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు, ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. మక్తల్ మండలంలోని భూత్పూర్, నేరడుగోమ్, దాదాన్‌పల్లి, అంకెన్‌పల్లి అనుగొండ గ్రామాల ప్రజలకు 30 ఏళ్లుగా న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినా తమ గోడు మాత్రం తీర్చడంలేదన్నారు. త్రీసభ్య కమిటీలకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. గ్రామాల్లో అధికారులు పర్యటించినా ఉపయోగం లేదన్నారు. తమ బాధలు అర్థం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పునరావాస బాధితులు